AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## ఇంటర్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ..




## సుదర్శన్‌రెడ్డికి సన్మానం




## స్కానింగ్ సెంటర్లకు అనుమతి తప్పనిసరి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** స్కానింగ్ సెంటర్లకు అనుమతి తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్య దాకా అధికారి రాజశ్రీ అన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ జిల్లాస్థాయి సలహా సంఘ సమావేశాన్ని నగరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పకుండా రిజిస్టర్ అయి ఉండాలన్నారు. అలాగే స్కానింగ్ యంత్రాల మోడల్, సీరియల్ నంబర్ సర్టిఫికెట్‌లో చేయాలన్నారు. ఒకవేళ వైద్యుడు లేదా సెంటర్ చిరునామా మారితే వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వివరాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో పిల్లల వెద్య నిపుణులు డాక్టర్ ప్రసన్న, వైద్యులు ఇందు, శ్వేత, సుప్రియ, వేణుగోపాల్ పాల్గొన్నారు.






## కళాశాల ఆకస్మిక తనిఖీ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించి ప్రిన్సిపల్ జయపాల్ రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పరీక్షలు దగ్గరకు వస్తున్న నేపథ్యంలో స్టడీ అవర్స్ కండక్ట్ చేసి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చే విధంగా చూడాలని అధ్యాపకులను ఆదేశించారు. డీఐఈవో వెంట ధర్పల్లి ప్రిన్సిపల్ శ్రీనాథ్, కళాశాల అధ్యాపకులు మధు, వెంకటేష్, గంగాధర్, మహేందర్, శ్రీహరి, గంగారాం, ల్యాబ్ అసిస్టెంట్ స్రవంతి ఉన్నారు.



## ధర్మారం(బి)లోని రామాలయంలో ధ్వజస్తంభ పున:ప్రతిష్ఠాపన

**అక్షరటుడే, ఇందల్వాయి:** డిచ్‌పల్లి మండలం ధర్మారం రామాలయంలో శనివారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుతో కలిసి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా భక్తి భావనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## బస్సు ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపర్చాలి

**అక్షరటుడే, ఇందూరు:** బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపర్చాలని ఆర్టీసీ కార్పొరేట్ చీఫ్ ఇంజినీర్ కవిత ఆదేశించారు. నిజామాబాద్ బస్టాండ్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రత పరిశుభ్రతకు ఎటువంటి లోపాలు లేకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. అవసరమున్న చోట భవనానికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా భవనం పైకప్పు, డ్రెయినేజీ వ్యవస్థ, ప్రయాణికుల విశ్రాంతి గదులను మరింత అభివృద్ధి పర్చాలని సూచించారు. అనంతరం టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫాంలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, డిపో మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. తానేమీ తప్పుచేయనంటూనే.. తప్పు చేస్తున్న వారికి ప్రత్యక్షంగా సహకరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి అనధికారికంగా పీఏగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ రెడ్డి వ్యవహారంలో డీఈవో మొదటి నుంచి వ్యవహరిస్తున్న శైలి పలు అనుమానాలకు తావిస్తోంది.**

- అక్షరటుడే, నిజామాబాద్




# పెద్దసారూ.. ఇదేమి తీరు..!

▸ డీఈవో వ్యవహార శైలిపై విమర్శలు ▸ ఎమ్మెల్యే పీఏ వ్యవహారంలో చర్యలు కరువు ▸ ఉపాధ్యాయ సంఘాలనూ పట్టించుకోని వైనం

ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఒత్తిడికి తలొగ్గిన డీఈవో శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఏళ్లుగా బడికి మొహం చాటేసిన టీచర్ పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన డీఈవో అశోక్ తనకేమీ తెలియదన్నట్లుగా వ్యవహరించి చిక్కుల్లోపడ్డారు. పైపెచ్చు మొక్కుబడిగా షోకాజ్ నోటీసు జారీ చేసి చర్యలు తీసుకోకుండా వదిలేశారు. మరోవైపు శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికీ ఎమ్మెల్యే పీఏగా కార్యాలయంలో నేరుగా కార్యకలాపాలు సాగిస్తుండడంపై సర్వత్రా చర్చకు దారి తీసింది. మామూలు టీచర్ల విషయంలో ఉరుకుపరుగుల మీద చర్యలు తీసుకునే అధికారులు, రాజకీయ అండదండలు కలిగిన వారిపట్ల కళ్లు మూసుకున్నట్లు వ్యవహరించడం ఉపాధ్యాయుల్లోనూ చర్చకు తెరలేపింది.

### కొరవడిన సమన్వయం

జిల్లా విద్యాశాఖాధికారిగా అశోక్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కార్యాలయంలోనూ అధికారులు, సిబ్బందితో సమన్వయం కొరవడింది. ప్రత్యేకించి అన్ని విషయాల్లో అనుమానాలు వ్యక్తపర్చడం.. నీతినిజాయితీ అంటూ ఊదరగొట్టడం ఇందుకు కారణం. అలా అని అన్ని విషయాల్లోనూ పక్కాగా వ్యవహరించడం లేదు. కొందరు ఎమ్మెల్యేలు ఫోన్ చేస్తే ఎలాంటి పని అయినా క్షణాల్లో చేసిపెడుతున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో డీఈవో ద్వంద్వ వైఖరిపై సొంత కార్యాలయంలోనే అసమ్మతి గళం వినిపించడానికి కారణమైంది. డీఈవో ఒకవైపు, మిగతా అధికారులు, సిబ్బంది మరోవైపు ఉన్నట్లు పరిస్థితి మారిపోయింది.

### సంఘాలనూ లెక్కచేయరు

విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాలది అత్యంత కీలకపాత్ర. విద్యాశాఖ తీసుకునే నిర్ణయాలను బడుల స్థాయిలో పక్కాగా అమలు చేయించడంలో సంఘాల బాధ్యులు క్రియాశీలకంగా వ్యవహరిస్తేనే అంతా సక్రమంగా జరుగుతుంది. కానీ ప్రస్తుత డీఈవో అశోక్ జిల్లాలోని ఏ ఉపాధ్యాయ సంఘంతో కూడా సఖ్యతతో లేకపోవడం గమనార్హం. దీంతో ఆయా సంఘాల నాయకులు సైతం డీఈవో వ్యవహరిస్తున్న తీరుపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

### అసంతృప్తితో ప్రైవేటు విద్యాసంస్థలు

జిల్లాలోని ప్రైవేటు విద్యా సంస్థలు సైతం డీఈవో తీరుపై అసంతృప్తితో ఉన్నాయి. ప్రత్యేకించి దశాబ్దాలుగా కొనసాగుతున్న బడుల పర్మిషన్స్ రెన్యువల్ విషయంలో డీఈవో అశోక్ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఏళ్లుగా నడుస్తున్న స్కూళ్లకు యథావిధిగా రెన్యువల్ పర్మిషన్స్ ఇవ్వకుండా కొత్తగా కొర్రీలు పెట్టిన ఘనత ఈయనకే దక్కింది. మరోవైపు కొత్తగా పుట్టుకొచ్చి బడులు సరైన నిబంధనలు పాటించకపోయినప్పటికీ ఎమ్మెల్యేలు ఫోన్ చేశారంటూ హడావుడిగా పని పూర్తి చేసిపెట్టడం గమనార్హం. మొత్తంగా అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు బడులపై సర్వాధికారాలు కలిగిన జిల్లా విద్యాశాఖాధికారి వ్యవహరిస్తున్న తీరుపై విద్యాశాఖలో విమర్శలు వస్తున్నాయి.

## 17న ఉమ్మడి జిల్లా ఖోఖో టోర్నీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఉమ్మడి జిల్లా బాలబాలికల జూనియర్స్ ఖోఖో టోర్నీని నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎండీ అతీఖుల్లా తెలిపారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2008 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత జన్మించిన బాలబాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, జిరాక్స్, జనన ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. బాలబాలికలకు సంబంధించిన ఇండెక్స్ 250 పాయింట్లు మించకూడదని ఆయన వివరించారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరావు (8555996271), అధ్యక్షుడు జీవీ భూమారెడ్డి (7396541233), ప్రధాన కార్యదర్శి ఎండీ అతీఖుల్లా (9676269988), కోశాధికారి మధు (9494259901)లను సంప్రదించాలని సూచించారు. క్రీడాకారులకు భోజన వసతి ఉందదని చెప్పారు.



## పీసీసీ చీఫ్‌తో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు భేటీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో ఎమ్మెల్యే తోట లక్ష్మీరాంతారావు భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడంపై పీసీసీ చీఫ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విజయం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచి పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పని చేశారన్నారు. ఈ గెలుపు ఇచ్చిన స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి.. పార్టీ విజయం కోసం కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వాల మెడలు వంచైనా రిజర్వేషన్ సాధిస్తాం: ఈశ్వరయ్య

**అక్షరటుడే, కామారెడ్డి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచైనా 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధిస్తామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ హాలులో శనివారం బీసీ ఆక్రోశ సభ నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. 2023 నవంబర్ నెలలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్ బీసీ కమిషన్ ద్వారా జనగణన, కులగణన చేపట్టి అమలు చేస్తామని చెప్పారన్నారు. అలాగే ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు బీసీల అభ్యున్నతికి ఖర్చు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. బూటకపు మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని




ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం చేయకుండా తప్పుల తడకగా కులగణన చేశారని విమర్శించారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ ఎలా అమలవుతుందో అదే తరహాలో ఇక్కడ కూడా ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

### ఫామ్‌హౌస్ దాటని కేసీఆర్

కేసీఆర్ దొరవారేమో ఫామ్ హౌస్ దాటి బయటకు రావడం లేదని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్‌పై నోరు మెదపడం లేదన్నారు. 34 శాతం ఉన్న రిజర్వేషన్‌ను బీఆర్‌ఎస్ హయాంలో 23 శాతానికి తగ్గించారన్నారు. కేంద్రంలోని బీజేపీ బీసీలకు చేసిందేమీ లేదన్నారు. బీసీలపై బీజేపీ వివక్ష చూపుతుందన్నారు. ముస్లిం రిజర్వేషన్‌ను బూచిగా చూపి బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ ఛైర్మన్ విశారదన్ మహరాజ్, రిజర్వేషన్ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు గౌడ్, మాజీ కలెక్టర్ చిరంజీవులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్వోబీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో ఆయా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మాధవ నగర్ ఆర్వోబీకి రూ.3.15 కోట్లు, అర్సపల్లికి రూ.7.46 కోట్ల నిధులను ఇప్పటికే ప్రభుత్వం కేటాయించిందన్నారు. సకాలంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అలాగే పనులను సకాలంలో పూర్తి చేయకుండా అలసత్వం ప్రదర్శించే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టేందుకు కూడా వెనుకాడబోమన్నారు. అడవి మామిడిపల్లి వద్ద బీటీ రోడ్డు పనులను పూర్తి చేసి.. డిసెంబర్ 15వ తేదీ లోపు వంతెనను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. రంగు మారిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని, మరో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట్ర దొంగలపై పీడీ యాక్ట్

**అక్షరటుడే, కామారెడ్డి :** అంతర్రాష్ట్ర దొంగలపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. జాతీయ రహదారులపై చోరీలు, దోపిడీలు, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న పార్థి ముఠాపై పోలీసులు ఈ మేరకు పీడీ అస్త్రం ప్రయోగించారు. నిజామాబాద్ జైలులో శిక్ష అనుభవిస్తున్న నిందితులకు ఉత్తర్వు కాపీని శనివారం అందజేశారు. ముఠా సభ్యులు కృష్ణ బాబు షిండే, నామ్‌దేవ్ అలియాస్ రామ్‌కిషన్ భోస్లే అలియాస్ రామ్‌దాస్, రాథోడ్ అజిత్ రమేశ్ అలియాస్ అజయ్‌లపై పీడీ యాక్ట్ పెట్టారు. అలాగే ముఠాకు చెందని ప్రధాన నిందితుడు భాస్కర్ బాపురావ్ చవాన్ అలియాస్ భాస్కర్‌దాదారావుపై సైతం పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇతడిపై సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, పిట్లం , బీర్కూర్, మద్నూర్ పోలీస్ స్టేషన్లతో పాటు నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలో మొత్తం 14 ప్రమాదకర దోపిడీ, చోరీ కేసులు ఉన్నాయి.

కలెక్టర్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై పుష్పరాజ్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ నర్సింలు శనివారం నిజామాబాద్ సెంట్రల్ జైల్లో నిందితులకు అందజేశారు.

## స్వయంభూ ఏకశిల రామాలయ నిర్మాణానికి భూమిపూజ

**అక్షరటుడే, ఆర్మూర్**: ఆలూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో రామాలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్వయంభూ ఏకశిల రామాలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. పలుగుట్ట శ్రీ మంగి రాములు మహారాజ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పలుగుట్ట మహారాజ్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక వికాసానికి దేవాలయాలు కేంద్ర బిందువులు అని అన్నారు. రామాలయ నిర్మాణం ఒక పవిత్ర యజ్ఞమని.. ప్రతి భక్తుడు ఈ దైవ సేవలో భాగస్వామి కావాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు, ఆయుర్వేద వైద్యులు బాలరాజ్, గోపి, రమేష్, నాగేష్, ప్రళయ్ తేజ్, అనిల్, నవీన్, సత్యానారాయణ, వీడీసీ సభ్యులు రాజు, గంగాధర్, పెద్ద గంగారాం పాల్గొన్నారు.



## నాణ్యమైన పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** ప్రజలకు నాణ్యమైన పెట్రోల్ అందించాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) మండల కార్యదర్శి బోశెట్టి మురళి మాట్లాడుతూ పెట్రోల్ బంక్ యజమానులు వినియోగదారులకు కల్తీ పెట్రోల్, కల్తీ డీజిల్ అమ్ముతున్నారన్నారు. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోసేటప్పుడు తూకాల్లో తేడా ఉంటుందని ఈ విషయాలు అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవట్లేదని ఆరోపించారు. పెట్రోల్ బంక్‌లలో పలు రకాల సేవలు ఉచితంగా అందించాల్సిన నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు వాసరి మోహన్, నాయకులు అశోక్, శేఖర్, మోహన్, సాయిలు పాల్గొన్నారు.

## ఏఎల్‌ఎం సమస్యల పరిష్కారానికి కృషి



**అక్షరటుడే, ఇందూరు:** జేఎల్ఎం, ఏఎల్ఎంల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని 2019 బ్యాచ్ ఏఎల్ఎం ప్రతినిధులు కోరారు. 327 యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గంగాధర్, రీజినల్ అధ్యక్షుడు వేణుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా బైఫర్‌కేషన్, సాధారణ బదిలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎల్ఎంలు షేక్ నజీమ్, ఎండీ ముజామిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## కాల్వలు, చెరువులు ఆక్రమిస్తే కఠినచర్యలు

**అక్షరటుడే, బాన్సువాడ:** చెరువులను ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువును పరిశీలించారు. చెరువు, కుంటలు కబ్జా అవుతుండడంపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గతంలో స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో నాయకులు నేరుగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిశారు. దీంతో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ శనివారం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా 49 ఎకరాల విస్తీర్ణంలో ఉండే చెరువును పలువురు కబ్జా చేస్తుండడాన్ని బీజేపీ నాయకులు చీఫ్ ఇంజినీర్ దృష్టికి తీసుకువచ్చారు. చెరువుకు సంబంధించిన కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయని వివరించారు. అధికారుల ఆదేశాలతో సమగ్ర సర్వే నిర్వహించి చెరువును కాపాడేందుకు తక్షణచర్యలు చేపడతామని చీఫ్ ఇంజినీర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రసాద్, నాయకులు శంకర్ గౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు అనిల్, వెంకట్, సాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ కళాశాలలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. దానికనుగుణంగా ప్రతి కళాశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య ప్రత్యేక కార్యచరణ చేపట్టారు. సౌకర్యాలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు.**

– అక్షరటుడే, లింగంపేట



# ఇంటర్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ

▸ తరగతులకు హాజరు గాని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన ▸ కళాశాలల్లో సౌకర్యాలపై వివరణ

ఇంటర్ విద్యలో ఈ ఏడాది అనేక మార్పులను తీసుకొచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. కళాశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులకు వినతిపత్రాలను అందజేస్తున్నారు. ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి.. ప్రతి కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, ఎంసెట్, నీట్, టెలీ మానస, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### ప్రత్యేక తరగతులు

కామారెడ్డి జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా కృషి చేస్తున్నారు. ప్రతి కళాశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని.. వారికి అర్థమయ్యే విధంగా అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు.

### కళాశాలకు రాని విద్యార్థులపై ఫోకస్

ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు కళాశాలకు రాకపోతే వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేస్తున్నారు. అయినా విద్యార్థి రాక పోతే వారి ఇంటి వద్దకు అధ్యాపకులు వెళ్లి వినతి పత్రం అందజేస్తున్నారు. విద్యార్థిని కళాశాలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

### కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు

కళాశాలలో విద్యార్థుల కోసం ఈ ఏడాది ప్రత్యేక కార్యక్రమాలను ఇంటర్ బోర్డ్ నిర్వహిస్తుంది. ప్రతి కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కళాశాలలో జరిగే కార్యక్రమాలను తిలకించేందుకు బోర్డ్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్‌కు అనుసంధానం చేశారు. మారుమూల కళాశాలల్లో జరిగే కార్యక్రమాలు హైదరాబాద్ నుంచి అధికారులు పర్యవేక్షించే ఏర్పాట్లు చేశారు. కళాశాలలో విద్యార్థులను దృఢంగా మార్చేందుకు హార్ట్‌ఫుల్‌నెస్, టెలి మానస, ఉమెన్ ట్రాకింగ్‌పై అవగాహన, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శనివారం స్పోర్ట్స్‌డే, ఫిజిక్స్‌పై మెలకువలను, యాంటీ డ్రగ్‌పై, కళాశాలలో స్టూడెంట్స్ కౌన్సిలర్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

### కళాశాలల్లో ఎఫ్ఆర్ఎస్ సిస్టం..



ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వహించే అధ్యాపకులు విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ సిస్టంను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అధ్యాపకుల టీచింగ్ డైరీ ఎప్పటికప్పుడు మానిటరింగ్ జరుగుతుంది. ప్రతి విద్యార్థిపై ఫోకస్ పెట్టి నాణ్యమైన విద్య అందిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో కల్పించే సౌకర్యాలపై పదోతరగతి విద్యార్థుల అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టాం.

– షేక్ సలాం,
**జిల్లా ఇంటర్ నోడల్ అధికారి**

## కొనసాగుతున్న నిత్యాన్నదానం

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వాములకు అన్నదానం కొనసాగుతోంది. శనివారం ఈ కార్యక్రమానికి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహశీల్దార్ విఠల్ హాజరయ్యారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేసి భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వాములకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అన్నదానం మహా దానమన్నారు. 15 ఏళ్లుగా అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సంతోష్ శర్మ, అయ్యప్ప సేవా ట్రస్ట్ కార్యదర్శి చక్రవర్తి, అన్నదాన కార్యక్రమం నిర్వాహకులు కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, పావులూరి వెంకటేశ్వరరావు, ముక్కు చిన్న బ్రహ్మయ్య గౌడ్, ప్రసాద్, రమేష్, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.





## హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ప్రతినెలా రెండో శనివారం మహా అన్నదానం చేయనున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్రాంతి, నర్సయ్య, శ్రీనివాస్, సాయన్న, వీడీసీ అధ్యక్షుడు కట్ట మహేష్, సలహాదారుడు విజయ్, దాసరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంక్రిమెంట్లు ఇవ్వాలని అధ్యాపకుల వినతి

**అక్షరటుడే, గాంధారి:** తమకు సెకండ్ అన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నప్పటికీ మాకు రావాల్సిన రెండో వార్షిక వేతన వృద్ధి ఇంకా అమలు కాలేదని వివరించారు. ఇంటర్మీడియేట్ కమిషనర్‌కు తమ తరపున వినతిపత్రం అందించాల్సిగా ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం మాట్లాడుతూ అధ్యాపకుల అభ్యర్థనను సంబంధిత ఉన్నతాధికారులకు వెంటనే పంపిస్తామన్నారు. సమస్య త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లెక్చరర్లు పాక రాజగోపాల్, ఎన్.లక్ష్మణ్, జెట్టి విజయకుమార్, కె.రమేశ్, వెంకటస్వామి, సంబాజి, సరిత తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన రూరల్ ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఇందల్వాయి:** సిరికొండ మండలంలోని తూంపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శనివారం తనిఖీ చేశారు. అయితే చిన్నారులు నేలమీద కూర్చొని చదువుకుంటుడడంతో వెంటనే డీఈవోకు ఫోన్ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ సిరికొండ మండలాధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాయకుడు ఎర్రన్న, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులున్నారు.

## విద్యుత్ భద్రతపై రైతులకు అవగాహన

**అక్షరటుడే, వర్ని:** చందూర్ మండలం కారేగావ్లో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా భద్రత అధికారి డీఈ (టెక్నికల్) అల్జాపూర్ రమేశ్ మాట్లాడుతూ.. ప్రతి రైతు పంటపొలాల్లో భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి పనులు స్వయంగా చేయకూడదని హెచ్చరించారు. ఎల్టీ ఫ్యూజ్‌లు పోయినప్పుడు వెంటనే లైన్‌మన్‌కు తెలియజేయాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిబ్బలను ఎత్తుపై ఉంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. వర్షం పడ్డప్పుడు ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ తీగలను తాకరాదని జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతుల మోటార్ల సామర్థ్యాన్ని 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీకి మార్చుకోవడానికి ఎలాంటి ఛార్జీలు ఉండవని, అలాగే మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని పేర్కొన్నారు. ఇళ్ల డాబాలపై విద్యుత్ వైర్లను కట్టి బట్టలు ఆరేయవద్దని కోరారు. ఎలాంటి విద్యుత్ సమస్యకైనా 1912కు కాల్ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్, చందూర్ ఏఈ గోపి, లైన్ ఇన్‌స్పెక్టర్ స్వామి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే:మెండోరా:** మెండోరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుద్‌గాం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. అనంతరం వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 50 ఏళ్ల వరకు ఉంటుందని, ఒంటిపై బ్లూ కలర్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఎవరికైనా మృతి వివరాలు తెలిస్తే ఆర్మూర్ రూరల్ సీఐ 8712659859, ఎస్సై సుహాసిని 8712659864లను సంప్రదించాలన్నారు.

ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో..



ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో..



## ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి సన్మానం

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో పాటు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు సన్మానించారు. కలెక్టరేట్‌కు శనివారం వచ్చిన ఆయనను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్ రెడ్డి నేతృత్వంలో సంఘం ప్రతినిధులు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో.. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రశాంత్, శ్రీనివాస్, ప్రభు, సతీష్ పాల్గొన్నారు. అలాగే ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు నరాల సుధాకర్, మారయ్య గౌడ్ తదితరులు కలిసి సన్మానం చేశారు.

## బోధన్‌లో ఎంఐఎం పార్టీ సంబరాలు




**అక్షరటుడే, బోధన్:** బీహార్ ఎన్నికలలో ఎంఐఎం పార్టీ ఐదుస్థానాల్లో విజయం సాధించడంతో బోధన్ పట్టణంలో శనివారం సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ బోధన్ అధ్యక్షుడు మీరు ఇలియాస్ మాట్లాడుతూ బీహార్ ఎన్నికల్లో ఐదు సీట్లు రావడం హర్షనీయమన్నారు. ఈ విజయం అసదుద్దీన్ ఒవైసీ కష్టం ఫలితమేనన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో అధిక స్థానాల్లో గెలుపొంది ఎంఐఎం సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అహ్మద్ బిన్ మోసిన్, ఉమర్, హబీబ్ ఖాన్, మాజీ కౌన్సిలర్ అత్తర్, అఖిల్ ఫారూఖీ, ఎండీ ఆదిల్, హాజీ బిల్డర్, సీనియర్ నాయకులు సాలాంచౌస్, ముస్తాక్ అహ్మద్, షేర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్ల కోసం పాఠశాలల్లో స్పెషల్ డ్రైవ్



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శనివారం పలు పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు ఉప్లూర్, ఏర్గట్ల, హాసాకొత్తూరు పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. ప్రభుత్వ కళాశాల్లో కల్పించే వసతులు, వీటిలో చదువుకుంటే భవిష్యత్తులో ఉండే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, క్రమశిక్షణతో కూడిన విద్య, వారాంతపు పరీక్షలు, స్టడీ అవర్స్ నిర్వహిస్తూ ప్రైవేట్ కళాశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నట్లు అధ్యాపకులు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరి తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుకుమార్, గంగాధర్, శ్రీహరి, వెంకటేష్, మహేందర్, గంగారాం, మురళీకృష్ణ, స్వాతి, స్రవంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.